# విదారవినయం

నిన్న సాయంత్రం డాక్టరును కలుసుకుని వచ్చినప్పటి నుంచీ ప్రాణం ప్రాణంలో లేదు అతిథికి.

ఈ రోజు అసలు కాలేజికి రాకూడదనుకున్నాడు. కాని ఆ మాత్రం పని కూడా లేకపోతే ఏం చేయడం? ఇంటి దగ్గర తండ్రికి ఎదురుగా కూర్చుంటే దుఃఖం మరీ ఎక్కువ అవుతుంది. తన బాధతో పాటు, తనను ఓదార్చడం పెద్ద పని అయిపోతుంది నాన్నకు.

డాక్టర్ల దగ్గరకు వెళ్ళడం, గంటల తరబడి వెయిట్ చేస్తూ ఉండడం, వాళ్ళు ఏవేవో పరీక్షలు అంటూ ప్రాణాలు తోడేయడం అలవాటు అయిపోయింది కనుక, ఆ సాయంత్రం నాన్న ఏమీ ప్రత్యేకంగా అడగలేదు, ఇంటికి వచ్చాక.

'డాక్టర్ ఏమన్నాడు?' అన్న ప్రశ్న అతి సహజంగా నోటినుంచి వచ్చేసేదే అయినా, ఈ రోజుల్లో దానికి అర్థం లేకుండాపోయింది.

డాక్టర్లు ఏమంటారు?

బాగా రెస్ట్ తీసుకోవాలంటారు. చెప్పినట్లు పరీక్షలు చేయించుకుని, మందులు, మాకులు తీసుకోవాలంటారు.

ఫీజు అడిగినప్పుడల్లా ప్రశ్నలు వేయకుండా ఇమ్మంటారు. మేం చెప్పిన ప్రకారం జాగ్రత్తగా ఉంటే, ఆ పైన భగవంతుడి దయకూడా కలిస్తే అయుర్దాయానికేమీ లోపం ఉండదు - అంటారు.

అంతా పరాధీనం అయిపోతున్నాయి బతుకులు.

ఇక్కడే అతిథికి తల బద్దలయిపోతుంది.

పని చేసేది - కష్టపడేది - నిష్ఠూరాలు పోయేది - మనిషి!

పనికి తగ్గ ఫలితం సంపాదించుకునేది మనిషి. మళ్ళీ దేవుడుని తీసుకురావడం ఎందుకో, అతనికి సుతరామూ అర్థం కాదు.

కేవలం మనకు తెలియని సంగతులను ఎక్స్‌ప్లెయిన్ చేయటానికి 'భగవం

తుదు' అని ఒక రూపకల్పన చేసుకుని, అంతా అయననెత్తిన రుద్దేయడం, మనకేమీ ప్రమేయం లేదన్నట్లుగా కూర్చోవడం... ఈ ఆధునిక యుగంలో, అంటే - మోడరన్ ఫిజిక్స్, ఫిలాసఫీ ప్రపంచం అంతా కలిపేసే ప్రక్రియలో జ్ఞాన విజ్ఞానాలను ప్రసారం చేస్తున్నప్పుడు కూడా అవసరమా? ఇదే అతని ఆలోచన.

మనిషిని ప్రధానంగా పెట్టుకోకుండా, ఎక్కడో కనిపించని మరో 'ఎంటిటీ'ని తలచుకుంటూ కూర్చోవడం కంటే మూర్ఖత్వం ఇంకొకటి లేదు... అని అతిథి కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచీ నిర్ధారణ చేసుకు కూర్చున్నాడు.

ఇప్పుడు అభిప్రాయాల్లో మార్పులు వచ్చాయని కాదు కాని, చిక్కుముడులు ఎక్కువయిపోయాయి.

'ఏమండీ, క్లాసేం లేదా? ఏమి టట్లా దిగాలు పడి కూర్చున్నారు?' అని ప్రశ్నించాడు కెమిస్ట్రీ లెక్చరరు.

'క్లాసు ఉందండీ. కాని వెళ్ళబుద్ధి కావడంలేదు. తీసుకోవడం లేదని ప్రిన్సిపల్‌కు చెప్పేశాను.'

'అదేం? నాన్నగారికి మళ్ళీ ఏమన్నా ఎక్కువయిందా?' అని అడిగాడాయన.

అతిథికి ఉన్న సమస్యేమిటో అందరికీ తెలుసును.

'అవునండీ.'

'వయస్సు, వయస్సయ్యా! ఏ మందులు పట్టిఇవ్వవు. కేవలం డబ్బు దండుగ తప్ప...!'

'అలా అని ఖర్చు పెట్టకుండా కూర్చోలేం గదండీ' అని మాట కలిపింది ఫిలాసఫీ లెక్చరర్ సునంద.

ఆమె తల్లి ఇటీవలనే అధిక రక్తపోటుతో నెల రోజులు ఆస్పత్రిలో తీసుకు చనిపోవడం గుర్తుకు వచ్చింది అతిథికి.

అప్పుడు సానుభూతి చూపడానికి అందరితోపాటు అతనూ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.

నిండు చందమామలాంటి ముఖంతో ఎప్పుడూ 'కళకళ' లాడుతూ ఉండే సునందను ఆ రోజు 'లాంగ్‌డ్రాన్ ఫేస్'తో కూర్చుని ఉండడం చూసి ముందు మనసులో నవ్వు వచ్చింది అతిథికి.

మళ్ళీ తనకు తానే బుద్ధి చెప్పుకున్నాడు. ఏమిటిలా అల్పంగా ఆలోచిస్తున్నాను నేను! జీవితంలో కష్టం, సుఖం ఊహించుకోలేనివాడి మోస్తరుగా.

'జీవితాన్ని గురించి ఎంతో 'ఫిలాసఫైజ్' చేసి మాట్లాడుతాం. కాని తీరా మన దగ్గరకు వస్తే మటుకు, పసిపిల్లల్లా బెంబేలు పడిపోతాం' అంది సునంద అప్పుడు.

ఈ మాటలలో నిజం ఇప్పుడు అతిథికి స్పష్టంగా అవగాహన అవుతోంది.

'ఇంతకూ ఏమిటి సంగతి?' మళ్ళీ గుచ్చి అడిగాడు కెమిస్ట్రీ లెక్చరర్.

అతిథికి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

ఎదురుగా ఉన్న ఇద్దరు, ముగ్గురూ మసకగా కనిపిస్తున్నారు. అదీ ఎంతో ప్రయాస చేసి ప్రయత్నంలో చూస్తే.

జేబురుమాలుతో ఒకమారు ముఖం తుడుచుకున్నాడు. కళ్ళు మెత్తగా అద్దుకుని, 'అన్ని పరీక్షలూ అయినాయండీ! కేన్సర్ అని నిర్ధారణగా చెప్పారు నిన్న డాక్టర్ తిరువేంగడం' అన్నాడు.

'అయ్యో పాపం!'

'ఇంకా కన్ఫర్మేషన్ కావాలంటే బొంబాయి తీసుకు వెళ్ళమన్నారు.'

'కేన్సర్ అని భయపడి కన్నీళ్ళు కార్చక్కర్లేదు. అదేం అంటు వ్యాధి కాదు, తగ్గదని అనుకుందుకూ లేదు.'

'లేదండీ! బాగా ఎడ్వాన్స్డ్ స్టేజికి వచ్చేసిందన్నారు. రోజులు లెక్కబెట్టుకోవడం తప్ప ఇంకేం చేయనక్కర్లేదన్నారు.'

'ఐ పిటీ యూ అతిథి! ఇప్పుడే ధైర్యంగా ఉండాలి. అలా బేంబేలు పడిపోకు.'

'బంధువులందరికీ ఉత్తరాలు రాసి పిలిపించు.'

— అయినా తండ్రికి ఒక్కడే. నేనూ ఒక్కడినే అనుకున్నాడు అతిథి! జీవితంలో ఒంటరిగాళ్ళు తామిద్దరూ.

అందరూ సానుభూతి వచనాలు చెప్పారు.

'ఎలా జరుగుతుందో అలా స్వీకరించడం తప్ప, మనం ఇంకేం చేయలేం...' అని తేల్చిపారేశారు.

'పోనీ ఇంటికి వెళ్ళిపో, పుట్టెడు దిగులుతో ఏం కూర్చుంటావు'

ఇంటికి వెళ్ళి చేయగలిగిందీ ఏమీ లేదు గనుక అలాగే దిగులుగా కూర్చున్నాడు అతిథి.

దిగులు క్రమంగా అలవాటు అయిపోతూంది. ఇవాళ ఉన్నంత సీరసం రేపు అనిపించదు. కొన్నాళ్ళు పోతే అసలు జరిగిన దుస్సంఘటనలే మరిచిపోతాం

గదా!

— అతిథి ఆలోచనలకు ఏమీ అంతరాయం లేకుండా మనస్సు మథనం చేస్తూనే ఉంది.

జీవితంలో ఏం జరుగుతోంది అన్నది ముఖ్యమైన విషయం కాదు.

ఆ జరుగుతున్నదానికి మనం ఎట్లా రెస్పాండ్ అవుతున్నాం... అన్నది ముఖ్యాతి ముఖ్యమైన విషయం.

మనకు సంభవించే - తటస్థించే - కష్టనష్టాలకు ఎవరిది బాధ్యత?

మనదే కదూ?

నీటి బుడగలాంటి జీవితం చుట్టూ ఎన్నో రక్షణలు, భద్రతలు ఏర్పాటు చేసుకుంటాం. వీటిని చూసి మురిసిపోతూ ఉంటాం. అంతకంటే అవివేకం మరేం లేదని గుర్తు చేస్తూ ప్రతిమారూ జీవితం మనను తలకిందులుగా—అతలా కుతలంగా చేసేస్తుంది.

ఎందుకు... ఎందుకు ఇట్లా జరుగుతుంది?

మెరుపులు, విరుపులు లేకుండా జీవితం సూటిగా నజావుగా ఎందుకు నడవ గూడదు?

ఎక్కడుంది దీనికంతటికీ తాళంచెవి?

'మీరేం అనుకోనంటే నే నో మాట చెబుతాను, అతిథిగారూ—' అంటూ పక్క కుర్చీలోకి వచ్చి కూర్చుంది సునంద.

అతిథి సర్దుకుని కూర్చున్నాడు. 'చెప్పండి' అనడం గూడా చేతకాలేదు అతనికి.

'జీవితంలో మమకారాలు మనని పట్టి సల్లారుస్తాయి. వాటిని మరిచిపోవాలని లెక్చర్ ఇవ్వటానికి కాదు నేను వచ్చింది.'

అతిథి ఆమెవంక కాస్త ఉత్సాహంగా చూశాడు.

"మీరు భగవంతుణ్ణి నమ్మరు. పూర్తిగా నాస్తికులు. నాకు తెలుసు" ఆమె ఒక్క క్షణం ఆగి— "నేనూ నమ్మను. రూపరహితమయిన భగవంతుడు నాకూ లేడు. కాని కొంతమందికి ఉన్నాడు. వాళ్ళ ఫెయిత్ మనం కాదన్నా పోనిది. ఆ మాట అయినా వప్పుకుంటారా?" అని అడిగింది.

"అవును" అని నింపాదిగా తల పంకించాడు అతిథి.

"సరే. ఇప్పుడు — భగవంతుడు ఉన్నాడా లేడా అని, సగుణుడా లేక నిర్గుణుడా అని కాదు మనకు చర్చనీయాంశం. మనిషికి జీవితంలో పరీక్షలు

వస్తాయి. వాటిని ధైర్యంతో ఎదుర్కోవడానికి ప్రయత్నం చేస్తాడు. కాని ఒక్కోమారు ఎంత ధైర్యము చాలదు. అప్పుడేదో 'ఎక్స్టర్నల్ ఏజెన్సీస్' కోసం పరుగులు తీస్తాడు. ఈ పరుగుల్ని మనం డాక్టరు దగ్గరకు వెళ్ళడంతో పోల్చుకోలేం. నిజానికి చూడండి. ఏమయితే అది అవుతుంది అని నిర్లిప్తంగా ఉండలేం గదా! ఓడిపోతున్నామని తెలుస్తూ ఉన్నా పోట్లాడుతూ ఉండవలసిందే... చివరిక్షణం వరకూ..."

అతిథి ఆమె వంక తదేకంగా చూస్తున్నాడు. మంచి ఆలోచన ఉన్న మనిషి — ఫిలాసఫీ లెక్చరరు అయినందుకు.

"ఇప్పుడు నేను ఓ మాట మీ చెవిని వేద్దాం అనుకుంటున్నాను. మీరు మరోలా అనుకోగూడదు. ఏమిటి, ఫిలాసఫీ లెక్చరరు ఇలా మాట్లాడుతోందేం అని. మీరు నాస్తికులని తెలిసినా ఇలా చెబుతోందేం అని..."

"ఊ, చెప్పండి. నేనేం అనుకోను" అన్నాడు అతిథి అతి ప్రయత్నం మీద.

"కేన్సర్ అని డాక్టర్లు నిర్ధారణ చేసిన తరువాత అది కేన్సర్ కాకుండా ఏ మామూలు అల్సరో అయి బతికి బయట పడ్డవాళ్ళూ ఉన్నారు దేశంలో."

అతిథి కళ్ళు సంతోషం పుంజుకున్నాయి.

"డాక్టర్లమీద గౌరవం కొద్దీ మనం వాళ్ళు చెప్పినవన్నీ చేస్తాం. ఇప్పుడు మిమ్మల్ని బొంబాయి వెళ్ళమని నేను చెప్పను. అంతకంటే, మరో పని చేయ మంటాను."

"ఏమిటది?"

"ఈ ఊళ్ళో— 'ఫలానా' చోట ఓ స్వాములవారున్నారు. అసాధ్యం అన్న కేసులు, భూ శయనం జరిపిన సందర్భాలు గూడా ఆయన రక్షాకవచాలతో నయం చేశాడని విన్నాను. నాకయితే ప్రత్యక్ష సాక్ష్యం లేదుగానీ, నాకు నమ్మకం ఉన్నవాళ్ళు చెప్పారు. కాకపోతే కాస్త ఎక్కువ డబ్బు గుంజుతాడట!"

—అతిథి ఉత్సాహం అంతా నీరు కారిపోయింది. ఈ సంగతి ఆమె స్పష్టంగా గమనించగలిగింది.

"ఫెయిత్ హీలింగ్ గురించి మీరు వినే ఉంటారు. ఆ బాపతు! మా అమ్మగారి మరణం తరువాత నాకు ఈ విషయం ఎరుక అయింది. అందుచేత నేను ప్రయోజనం పొందలేకపోయాను. పోనీ మీకయినా లాభించవచ్చునేమో నని సజెస్ట్ చేస్తున్నాను. మీ ఇష్టం."

అతిథి ఏమీ రెస్పాండ్ అవలేదు.

"ఇదోరకం మూఢనమ్మకం అయిన మాట నిజమే. కాని ఉపయోగిస్తుం దేమో!" అంది ఆమె మళ్ళీ.

"మీ సలహాకు థాంక్స్. ఆలోచిస్తాను. ఏ పుట్టలో ఏ పాముందో అని సామెత ఉంది చూడండి. మనమేం చెప్పలేం. ఉపయోగించవచ్చు - నిరుపయోగం కావచ్చు. అంతా పరాధీనం!" అన్నాడు అతిథి ఈ మారు.

సునంద కొంత తేరుకుంది. 'ఒక అభిప్రాయం అతని మెదడులో ప్రవేశపెట్టాను. చూదాం. ఏమయినా పనికి వస్తుందేమో! ఒకవేళ అతిథి నాన్నగారికి ఈ రక్షాకవచం పని చేసి ఆయన ఇంకో పది పన్నెండేళ్ళు బతికితే - తనకంటే సంతోషించేవాళ్ళు లేరు-' అనుకుంది సునంద.

అతిథి ఆ సాయంకాలం ఇంటికి వెళ్ళి నేరుగా తండ్రి గదిలో ప్రవేశించాడు.

ఆయన మంచంమీద పడుకుని ఉన్నారు.

నిద్రపోవడం లేదు.

"వచ్చావా అతిథీ! అయిపోయిందా కాలేజీ?" అన్నారు.

తల ఊపాడు అతిథి.

"టీ తీసుకున్నావా?"

"ఇంకా లేదు."

"తీసుకురా. బాగా అలిసిపోయి ఉంటావు" అన్నారు.

తల్లీ తండ్రీ తానే అయి పెంచారు గదా చిన్నప్పటినుంచి, ఈ ఆఖరు రోజుల్లో కూడా ఎంత శ్రద్ధ, ఎంత మమకారం!

—అతిథి పదేళ్ళ కుర్రవాడుగా ఉన్నప్పుడు తల్లిపోయింది.

తల్లి అనారోగ్యం, తండ్రి ఆమెకు ఎంతో శ్రద్ధగా ఉపచారాలు చేస్తూ ఉండడం, పగలూ - రాత్రి వినుగూ విరామం లేకుండా కనిపెట్టుకు ఉండడం, ఈ పనుల్లో అతిథి సదుపాయాలకూ, అవసరాలకూ ఎలాంటి లోపమూ రాకుండా జాగ్రత్త పడడం—ఇదంతా కళ్ళముందు మెదులుతూంటుంది అతనికి.

అంత ఓపిక, శ్రద్ధ, నిదానం... ఎట్లా వస్తాయి మనిషికి? అని అనేకమార్లు ఆలోచించాడు.

మనిషి తాను చేయవలసినపని ఇది - అని తీర్మానించుకున్న తరువాత - ఆరు నూరయినా, పిడుగులు పడినా దానికోసమే పట్టుదలగా పని చేస్తాడు కాని, ఆ తీర్మానం సడలిపోవడం, పడిలిపోవడం సహించలేదు. అయితే అంత

గట్టి తీర్మానం చేసుకునే మనుషులు అరుదు. గాలివాటు జీవితాలు అయిపోతున్నాయి – రోజు రోజుకూ. 'ట్రెండ్' ఎటు ఉంటే అటు కొట్టుకుపోవడమే తప్ప, 'ఇది నా ధర్మం, ఇది కర్తవ్యం' అనే దృష్టి లోపిస్తోంది బహుసంఖ్యాకులకు.

వంట పనులు, ఇంటి పనులు చూడటానికి ఓ పెద్ద వయసు ఆవిడ ఉన్నారు.

నమ్మకమైన సహాయకులు దొరకడం దుర్లభం అయిపోతున్న రోజుల్లో ఇలాటి వ్యక్తి తమను కనిపెట్టుకు ఉండడం ఒక రకంగా అదృష్టంగానే భావిస్తాడు అతిథి.

ఈ పనులతో పాటు తండ్రిని గమనిస్తూ ఉండడం. అంటే ఆ గదివయిపు ఒక కన్నువేసి ఉంచడం కూడా ఆమె చేస్తున్నారు, అవసరం ఏర్పడినప్పటి నుంచీ.

'మీకు చాలా శ్రమ ఇస్తున్నాను' అంటాడు అతిథి, సమయం – సందర్భం వచ్చినప్పుడల్లా.

'ఇదేం మాట బాబూ! ఇదంతా ఎంత పనీ!' అంటుందామె. వెంటనే తనమీద బరువు ఉంచుకోకుండా.

"పరిస్థితిలో ఏమీ మార్పులేదు జానకమ్మగారూ. జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండడం తప్ప మనం చేయవలసింది ఏమీ లేదన్నారు డాక్టర్లు. మందులు, మాకులు కూడా అనవసరంట" అన్నాడు అతిథి టీ చప్పరిస్తూ.

జానకమ్మ కళ్ళు తుడుచుకోవడం అతని గమనానికి వచ్చింది.

"నీలాంటి కొడుకు ఉంటే, ఇంకా కావలసిందేముంది నాయనా! ఆయన అదృష్టవంతుడు" అంది ఆమె.

నేనేం చేస్తున్నాను... నేనేం చేయగలుగుతున్నాను... అనారోగ్యం నుంచి తండ్రిని బతికించుకుందుకు, పరిపూర్ణాయుర్దాయంతో ఆయన కులాసాగా కాలక్షేపం చేసేందుకు దోహదం చేయలేకపోతున్నాను గదా... అని లోపల్లోపల ఒకటే కుమిలిపోతున్నాడు అతిథి.

ఆ బాధ చూడలేక, చూడడం తప్ప ఇంకేం చేయలేక–సతమతం అవడం కంటే ఇంక చేయగలిగిందేమీ లేదా?

అసలు మందు మాకులు, వైద్యుల పరీక్షలు అంటేనే చిరాకు తండ్రికి. 'వయసుతో పాటు శరీరంలో జవసత్వాలు అణిగిపోతాయి. ఇదంతా సహజం. కాదనడం ప్రకృతిమీద తిరుగుబాటు చేయడమే!'– అని ఆయన చెబుతారు.

'నువ్వు ఊరికే హైరాణ పడిపోకురా, అతిథీ! ఏం అవుతే అదే అవుతుంది'

అంటారు.

కొత్తరకం చికిత్సల గురించి ప్రస్తావించినా, 'యువకుడినీ, మధ్య వయసు వాడిని కాదు. రేపు ఫిబ్రవరికి ఎనభై రెండు నిండుతాయి. ఇలా సునాయాసంగా పోవడం కంటే నాకు ఇంకేం కావాలి?' అంటారు.

ఆయన బాధతో మెలికలు తిరిగిపోతూ ఉన్నప్పుడు చూడడం అతిథికి అసాధ్యం అయిపోతుంది. ఎన్ని సెడెటివ్స్ మింగించడం? అవి ఎక్కువగా పని చేస్తూ ఉన్నప్పుడు గూడా. ఏమిటిదంతా క్రమంగా మనిషి సింక్ అయిపోవడం లేదు గదా!.... అని బెంగపడిపోతూ ఉండడం-- అలవాటు పడిపోయింది.

స్వాములవారి సహాయం పొందాలంటే తనూ వెంటనే నిర్ణయం తీసుకోవాలి. తాపీగా ఆలోచిస్తాలే అనుకుందుకూ, పై నెలలో చూసుకుందాంలే – అనుకుందుకూ సమయం లేదు.

తండ్రితో ప్రస్తావించాలా, అక్కర్లేదా – అని ఒక్క క్షణం యోచించాడు. ఆయన ఏమంటాడు? 'నువ్వు కూడా ఈ చాదస్తంలో పడిపోతున్నావా అతిథీ! నా కోసం నీ నమ్మకాలు, అభిప్రాయాలు కాస్సేపు పక్కకు నెట్టేస్తున్నావా?.... ఇదంతా అనవసరమయిన యాతన అనిపించడంలేదూ?' అంటారని అతిథికి బాగా తెలుసు. ఆయనతో ఆలోచించి తీసుకోవలసిన నిర్ణయం కాదిది. తనకే పూర్తి నమ్మకంలేని సంగతి, ఆచరణకు ఎక్కించడం!

"అట్లా ఓ అరగంటసేపు బయట తిరిగి వస్తాను" అని బయలుదేరాడు అతిథి.

వెళ్ళి చూద్దాం ముందు అక్కడి వాతావరణం బట్టి – స్వాములవారు ఇంప్రెస్ చేస్తే, ఇదంతా వర్త్‌వైల్ అనిపిస్తే అలాగే చేయవచ్చు లేదా వెనక్కు వచ్చేయవచ్చు. ఎవరూ బలవంతం చేయలేరు గదా – అనుకున్నాడు.

స్వాములవారి ఆశ్రమం ఇక్కడి నుంచి ఇరవై కిలోమీటర్లు ఉంటుంది. టాక్సీ తీసుకున్నాడు అతిథి, తొందరగా వెళ్ళడం కోసం. పాతిక, ముప్పై రూపాయలు అయితేనేం – డాక్టర్లు ఫీజు అడిగితే ఇవ్వడం లేదా!

అతిథి అక్కడకు చేరుకునేసరికి చీకటి తెరలు ఆకాశంలో నుంచి భూమి మీదకు దిగడానికి ప్రయత్నం చేస్తున్నాయి.

ఆశ్రమం ముందు ఓ ఇరవై ఏళ్ళ యువకుడు కూర్చుని ఉన్నాడు. "రండి. రండి" అన్నాడు అతిథి టాక్సీ దిగుతూ ఉండగా.

"స్వాముల వారిని కలుసుకోవాలి!"

"వారు సమాధిలో ఉన్నారు. ఒక అరగంటగ్గాని బయటకు రారు. వెయిట్ చేయండి... మీ పేరు?" అన్నాడు.

"పేరు ఏదయితేనేంలే. వారిని వీలయినంత త్వరగా చూడాలి. ఆ ఏర్పాటు చేయి" అని అతిథి చేతి గడియారం వంక చూసుకున్నాడు.

ఆ యువకుడు లోపలకు వెళ్ళి సరిగ్గా ఇరవై నిమిషాల అనంతరం బయటకు వచ్చాడు "రండి, పిలుస్తున్నారు" అన్నాడు.

అతని ఆలోచనలకు అంతరాయం! – అతిథి చేతిగడియారం చూసుకుని – 'హా లక్కీ అయ్యాం! పది నిమిషాలు జయించాను' అనుకున్నాడు.

లోపల విశాలమయిన గది.

ఏదో పెద్ద విగ్రహం. ఆ విగ్రహం చుట్టూ దేదీప్యమానంగా వెలుతురు.

విగ్రహానికి కాస్త దూరంలో ఓ అడుగు ఎత్తు వెండిపీఠం మీద ఓ ఏభై ఏళ్ళ భారీ మనిషి కూర్చుని ఉన్నాడు, చేతిలో జపమాల తిప్పుతూ. అతిథి లోపలకు వచ్చి ఆయన్ను చూస్తూనే రెండు చేతులూ జోడించాడు.

"కూర్చో నాయనా! ఏం కావాలి?" అన్నాడు.

అతిథి సూక్ష్మంగా చెప్పాడు తన అవసరమేమిటో. "మీ బలంతో మా నాన్న గారు మళ్ళీ మామూలుగా తిరిగేట్లు చేయగలిగితే, మీరు కోరుకున్న కానుకలు ఇచ్చుకుంటాను" అన్నాడు.

"అలాగే నాయనా, అవశ్యం. మీ నాన్నగారు లేచి నడవాలా – పరుగె త్తాలా?" అనడిగారు.

అతిథికి ఈ ప్రశ్న అర్థం కాలేదు. ఈయన హేళన చేయడంలేదు గదా, తన అవసరాన్ని... అని అనుమానం కూడ వచ్చింది.

"తెలియలేదు గదూ! వివరంగా చెబుతాను విను. అసాధ్యమైన రోగం మీ నాన్నకు. రోజుల్లో ఉంది వ్యవహారం. ఆయనకు పరిపూర్ణమయిన ఆరోగ్యం ప్రసాదిస్తాం. ఒక నెల రోజుల్లో ఆయన లేచి తిరగగలిగితే చాలంటావా! లేక వెంటనే మామూలు మనిషి అయిపోవాలంటావా?"

–ఆయన అంతా తన చేతిలోనే ఉన్నట్లు, ఇదేదో సునాయాసమైన పని అన్నట్లు మాట్లాడడం అతిథికి ఆశ్చర్యం కలిగించింది.

అతను నమ్మలేకుండా ఉన్నాడని గమనించి స్వాములవారు– "మాటలు గాదు నాయనా! చేసి చూపిస్తాం. నమ్మకం ఉంటేనే అడుగు ముందుకు వెయ్యి" అన్నారు.

"మీ ఫీజు ఎంత?"

"నీకు ఏరకం కావాలో, దాన్ని బట్టి."

"వెంటనే నయం కావాలంటే?"

"పది వేలు."

"నెల రోజులు — క్రమంగా..."

"అయిదు వేలు."

దట్సాల్! అనిపించింది అతిథికి, కాని... కాని... ఇదంతా సాధ్యమా? కేవలం అయిదు వేలతో ఆయుర్దాయం కొనుక్కోగలిగితే అసలు ఈ ప్రపంచంలో చనిపోయేవాళ్ళు అంటూ ఉంటారా?

దేశం నిండా దొంగ స్వాములు, దొంగ సన్యాసులు, ప్రజల మూఢత్వాన్ని 'కేష్' చేసుకుంటూ తిరగడంలో ఇదీ భాగం కాదు గదా!... కాకుండా ఎలా ఉంటుంది!

"వ్యవధానం ఎక్కువ లేదు నాయనా. ఏం చేసినా రేపు ఉదయమే."

అతిథి ఏమీ చెప్పలేకపోతున్నాడు.

"నీకు నమ్మకం లేదు. నీవు ఈ లోకానికి చెందినవాడవు కాదు. అసలు నీ పేరే అలాంటిది!" అన్నాడు స్వాములవారు.

అతిథికి తాను ఇంతవరకు తన పేరు బయట పెట్టకపోవడం గమనానికి వచ్చింది.

"నీవు చిన్నవాడివీ, తండ్రి అంటే ఎక్కువ అభిమానం ఉన్నవాడివీ గనుక, ఫీజు కాస్త తగ్గిస్తాను. ఏడు వేల అయిదు వందలు ఇచ్చెయ్యి, రేపు ఉదయం రక్షాకవచం తయారు చేయిస్తాను. సాయంత్రం వచ్చి దర్శనం చేసుకువెళ్ళు. అంతా సరిపోతుంది."

ఇవ్వదలుచుకున్నప్పుడు రేపటి దాకా వాయిదా ఎందుకు? చెక్ ఇస్తాను ఇప్పుడే. పని ప్రారంభించండి అన్నాడు.

"తొందర లేదు నాయనా. రేపు ఉదయం పది గంటలకు డబ్బే పట్టుకు రా! చెక్ వద్దు."

—మరునాడు ఉదయం కరెన్సీ నోట్లు స్వాములవారి చేతుల్లో పోయడానికి వెళ్ళాడు అతిథి.

"రసీదు ఇస్తారా ఈ డబ్బుకు?" అని అడిగారు.

"రసీదులు, పత్రాలు అన్నీ మామూలు లోకానికి సంబంధించినవి నాయనా! మన మధ్య కాదు."

అతిథికి కోపం వచ్చింది.

"మీరు మోసం చేస్తే? రక్షాకవచం పని చేయకపోతే? డబ్బు వాపసు చేస్తారా?"

"పని చేయకపోవడం ఉండదు. నువ్వే చూస్తావు. వెళ్ళిరా."

"లేదు. లేదు. నాకు రసీదు కావాలి. గారంటీ కావాలి..."

"అన్నీ సాయంత్రం. వెళ్ళిరా. బోలెడు పని ఉంది. బంగారంతో కవచం చేయించాలి. నవరత్నాలు పొదగాలి. మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా పూజలో చేర్చాలి. నాలుగు గంటల పాటు జపం చేయాలి. సాయంకాలం నాలుగు గంటలకు మీ నాన్నకు నయం అయిపోతుంది. వెళ్ళు. వెళ్ళు..."

అతనికి మనసులో పీకుతోంది. మరో మార్గంలేదు.

"అనుమానంతో పనులు చేయకు. కోపం అసలు పనికిరాదు. నీకు నమ్మకం ఉంటేనే ఆ డబ్బు పళ్ళెంలో పొయ్యి. బలవంతం లేదు."

—సాయంత్రం ఎన్ని గంటలకు రావాలో కనుక్కున్నాడు.

"సరిగ్గా ఆరు గంటలకు ఇక్కడుండు. రక్షాకవచం చూపిస్తాను. నమస్కారం చేసి వెళ్ళు..."

"నాకు ఇవ్వరా అది?"

"ఊహు. అది పూజలోనే ఉంటుంది. అది ఇక్కడ పూజలో ఉన్నన్నాళ్ళూ మీ నాన్నకు ఏం ఫరవాలేదు."

"ఒకవేళ పని జరగకపోతే-- ఆ బంగారం, నవరత్నాలు నాకు ఇచ్చివేయరా?"

"ఊహూ. ఇవ్వం. ఒకళ్ళకు తయారు చేసింది ఇంకెవరికీ పనికిరాదు. ఆ బంగారం కరిగించి బీదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తాం."

అతిథి వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

గాలిలో దీపం పెట్టాను – అనుకున్నాడు.

ఆరోజంతా ముళ్ళమీద కూర్చున్నట్లు ఉంది. అవివేకంగా డబ్బు కూడా పోగొట్టుకుంటున్నానా?

నాన్న మళ్ళీ లేచి సునాయాసంగా తిరుగుతారా?

ఇదంతా ఏమిటి?

పోయిపోయి తను ఆ స్వాములవారి మాయాజాలంలో ఇరుక్కుపోయినాడేం!

తీరా పని జరగకపోతే నలుగురికీ తెలిస్తే ఎంత పరాభవం! పైకి ఎవళ్ళు ఏమీ అనరు కాని ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి! ఆఖరుకు సునందకు కూడా చెప్పలేదు -- తను ఇలా నిర్ణయం తీసుకున్నట్లు పబ్లిసైజ్ చేయడం ఇష్టం లేక.

ఆ రోజు కాలేజీకి వెళ్ళలేదు. ఆమె కలవలేదు గనుక సరిపోయింది.

సాయంత్రం నాలుగు గంటలకు 'అతిథీ' అని పిలిచారు నాన్నగారు.

'ఏం నాన్నా?' అని దగ్గరకు వెళ్ళాడు.

"నువ్వేం దిగులు పడకు. నేను లేనప్పుడు కూడా ఆత్మస్థైర్యంతో హాయిగా కాలక్షేపం చేసెయ్యి. దేన్ని గురించీ దిగులు పడకు" అన్నాడు.

"అలా మాట్లాడకండి నాన్నా. మీకేమయిందని? నయం అయిపోతుంది గదా!"

ఆయన చిన్నగా నవ్వినట్లు అనిపించింది అతిథికి. ఉత్సాహం పుట్టుకు వచ్చింది మనసులో.

"నాకు చాలా కులాసాగా ఉన్నట్లుంది. మనసంతా తేలిక పడిపోయింది. నిన్ను గురించి నాకేం బెంగలేదు" అన్నాడు ఆయన మళ్ళీ కళ్ళు మూసుకుంటూ.

అతిథికి ఆశలు పొరలు పొరలుగా విప్పుకుంటున్నాయి.

సరిగా ఆరు గంటలకు వెళ్ళాడు ఆశ్రమానికి.

అరగంట తరువాత దర్శనం దొరికింది. "రక్షాకవచానికి నమస్కారం చేయి - సాష్టాంగ దండప్రమాణం చేయి" అన్నారు స్వాములవారు.

"ఏది రక్షాకవచం?"

"అమ్మవారి పాదాల దగ్గర ఉంది."

"తీసి చూపించండి."

"పాదాల దగ్గరున్న కవచాన్ని కదపగూడదు. మహాపాపం."

"మీరు చేశారో లేదో నాకెలా తెలుస్తుంది. -- ప్రత్యేకంగా చూపించకపోతే?"

"ప్రమాణం ఏమిటంటే ఫలితం కనిపించడమే. వస్తువు కాదు. ఈ లోకంలో వస్తువు ఎప్పుడూ నశ్వరమయిందే!"

మనిషి మాత్రం ఈ లోకంలో వస్తువు కాదా - అనిపించింది అతిథికి.

"కాదు. నాకు చూపించవలసిందే. లేకపోతే, మీరు చేయించలేదనుకుంటాను, పోలీసులకు చెబుతాను" అని గంభీరంగా అన్నాడు.

"తొందర పడకు నాయనా, అనవసరంగా మాటలు జారకు."

అతిథికి సమాధానం కాలేదు.

ఇంకా పట్టుదల చూపించాడు. మాటలు ఘాటుగా వదిలాడు.

"పితృ హంతకుడివి! వెళ్ళు, వెళ్ళు..." అని భయపెట్టి పంపేశాడు స్వాములవారు.

అతిథికి ఏం చేయాలో తోచలేదు. ఆశ్రమం నుంచి తిన్నగా ఇంటికి వచ్చేశాడు.

తరువాత ఓ గంటకు అతిథి నాన్నగారు బంధాలు, బాధలు అన్నీ బద్దలు కొట్టుకున్నాడు.